క్లుప్తంగా

నెక్లెస్ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

సిద్దిపేటజోన్: నెక్లెస్ రోడ్డు తుది పనులను మున్సిపల్ కమిషనర్ సంపత్ గురువారం పరిశీలించారు. కోమటిచెరువు చుట్టూ ఏర్పాటు చేస్తున్న నెక్లెస్ రోడ్డు గూర్చి, వసతులపై ఆరా తీశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని మున్సిపల్ ఏఈ మహేశ్‌ను ఆదేశించారు. రీటైనింగ్ వాల్ పనులను పరిశీలించారు.

క్రీడాకారులకు అండగా ఉంటా

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

దుబ్బాకటౌన్: క్రీడలను ప్రోత్సహించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. గురువారం అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని తన స్వగ్రామం బొప్పాపూర్‌కు చెందిన క్రీడాకారులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేటలో అకాల మరణం చెందిన మెరుపుల కిషన్‌గౌడ్ భౌతికకాయానికి ఎమ్మెల్యే రఘునందన్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఎనగంటి సత్తవ్వ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాలేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న కౌన్సిలర్ దంపతులు

దుబ్బాక: దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ వార్డులో గల పోచమ్మ ఆలయ అభివృద్ధికి 2వ వార్డు కౌన్సిలర్ గోనేపల్లి దేవలక్ష్మి సంజీవరెడ్డి రూ.51,116ల విరాళాన్ని గురువారం ఆలయ బాధ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ బాధ్యులు పోచమ్మ వార్షికోత్సవాలకు హాజరు కావాలని కౌన్సిలర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆలయ అభివృద్ధికి విరాళం అందించిన కౌన్సిలర్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ బాధ్యులు, కుల సంఘాల పెద్దలు, తదితరులున్నారు.

అన్నదాతల అగచాట్లు



కాల్వలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న రైతులు

నంగునూరు(సిద్దిపేట): వేసవి ఎండలు మండుతున్న వేళ.. చెరువులో నీళ్లు లేక ఇబ్బంది పడుతున్న అన్నదాతలు కాల్వల ద్వారా బిరబిర పారుతున్న నీటిని చూసి ఆనందంతో ఉప్పొంగిపోయారు. రంగనాయకసాగర్ నీటితో పాలమాకుల కొత్త చెరువు నిండుతుందని భావిస్తున్న వేళ కాల్వలో మట్టి, చెత్త, చెదారం, రాళ్ల రప్పలు అడ్డు పడడంతో నీరంతా అక్కడే నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న గ్రామ రైతులు కాల్వలో దిగి రెండు గంట పాటు శ్రమించి చెత్త, రాళ్లను తొలగించడంతో చెరువులోని నీరు చేరుతోంది.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

కొండపాక(గజ్వేల్): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఎంపీపీ సుగుణ అన్నారు. మండల పరిధిలోని మర్పడ్గలో గురువారం ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్, సర్పంచ్ రజిత, ఎంపీటీసీ ఆంజనేయులుతో కలిసి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సాయిబాబ, ఉపసర్పంచ్ యాదగిరి, పీఏసీఎస్ డైరెక్టర్ బాల్‌నర్సు, వెలికట్ట సర్పంచ్ రమేశ్, పీఆర్‌ఏఈ తిరుపతిరెడ్డి, రైతుబంధు మండల కో–ఆర్డినేటర్ దుర్గయ్య పాల్గొన్నారు.

స్టూడియో నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న రాజనర్సు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న దళితబంధులో భాగంగా తెలంగాణ ఉద్యమ కళాకారుడు కళాంజలి రాజేశ్ నిర్మించనున్న కళాంజలి స్టూడియోకు గురువారం సిద్దిపేట పట్టణంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు భూమిపూజ నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలో స్టూడియో ద్వారా అనేక మంది కళాకారులకు ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మైదానం ఇలా.. ఆడేదెలా?

- చుట్టూ బండరాళ్లు, ముళ్ల పొదలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు
- పట్టించుకోని అధికారులు



అక్కన్నపేటలో క్రీడా ప్రాంగణం దుస్థితి

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు సంకల్పించింది. వీటి అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేసింది. అక్కన్నపేట మండల కేంద్రంలో ప్రభుత్వ భూమి పుష్కలంగా ఉంది. కానీ రెవెన్యూ అధికారులు రైతు వేదికకు సమీపంలో గుట్టల్లో 20 గుంటల భూమిని గ్రామీణ క్రీడా ప్రాంగణానికి కేటాయించారు. అందులో పెద్దపెద్ద బండరాళ్లు, ముళ్ల కంపలు ఉన్నాయి. అందులోనే బోర్డుపాతి, స్తంభాలు ఏర్పాటు చేశారు. క్రీడా ప్రాంగణం ఇలా ఉంటే ఆటలెలా ఆడాలని క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు మండలంలోని 32 గ్రామ పంచాయతీలు ఉండగా 27 గ్రామ పంచాయతీల్లో మాత్రమే క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. మిగిలిన గ్రామాల్లో స్థల కొరత పేరుతో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయలేదు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూమి కబ్జాలకు గురవుతున్న రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి అన్నీ గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని మండల క్రీడాకారులు కోరుతున్నారు.

స్వీయ రక్షణతో ముందుకెళ్లాలి



సిద్దిపేటఎడ్యుకేషన్: మహిళా అధ్యాపకులు, సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం



హుస్నాబాద్: వేడుకల్లో పాల్గొన్న మహిళలు

సిద్దిపేటఎడ్యుకేషన్: స్వీయ రక్షణ, స్వీయ క్రమశిక్షణతో విద్యార్థినిలు జాగ్రత్తగా ముందుకు సాగాలని వక్తలు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో గురువారం మహిళా అధ్యాపకులు, సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్, రేలారేఫేమ్ భార్గవి, శ్రీనివాస్, ఆయా విభాగాల కన్వీనర్లు, కోఆర్డినేటర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ భవాని, డాక్టర్ సీహెచ్ మధుసూదన్, డాక్టర్ గోపాలసుదర్శనం, డాక్టర్ అయోధ్యరెడ్డి, డాక్టర్ మల్లేశం పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

హుస్నాబాద్: మహిళలు అనుకుంటే ఏదైనా సాధించవచ్చని, మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఆర్యవైశ్య విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే రన్‌లో రాణించిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులను గురువారం అభినందించారు. 5కే రన్‌లో రాణించి ద్వితీయ స్థానం సాధించిన హారిక, తృతీయ స్థానం సాధించిన హిందూలను వారికి సహకరించిన పీడీ సుజాత, సువర్ణలతలను, ఉత్తమ మహిళ ఉపాధ్యాయురాలుగా అవార్డు పొందిన ఉదయశ్రీలను పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, కౌన్సిలర్లు పూర్ణిమ ఎల్లంలు సన్మానించారు. కార్యక్రమంలో శకుంతల, ప్రభు, జాకెరా, పద్మావతి, పరశురాములు, రంగాచార్యులు, హిమబిందూ, అక్బరునిసా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



బోనాల ఊరేగింపులో భక్తులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తిలో వారం రోజులుగా కొనసాగుతున్న బీరప్ప ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్పకు నాగవెల్లి బోనాలు చేశారు. ఈ సందర్భంగా ఒగ్గుడొళ్ల చప్పుళ్ల, శివసత్తుల పూనకాలు, ఒగ్గు కళాకారుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలతో బీరప్ప ఆలయానికి వెళ్లారు. గురువారం తెల్లవారుజామున నాగవెల్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒగ్గు కళాకారులు మహంకాళి, బీరప్ప, కామరాతి, బోగన్న వేషాలు వేసి నాగవెల్లి కథను వినిపించారు. అంతకుముందు కురుమ సంఘం పెద్దలు గ్రామ సర్పంచ్ నాంపల్లి సవితాచంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్‌ను శాలువాతో సన్మానించారు.

పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న పీఆర్టీయూ నేతలు

గజ్వేల్: పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని కోరుతూ గురువారం గజ్వేల్ మండలంలోని వివిధ విద్యా సంస్థల్లో ఆ యూనియన్ సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షుడు శశిధరశర్మ, గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు ఊడేం వేమారెడ్డిలు ప్రచారం నిర్వహించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు హన్మంతరెడ్డి, కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు పంటలపై శిక్షణ

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు పంట రక్షణకు సస్యరక్షణ పద్ధతులను పాటించాలని సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారి నీలారాణి అన్నారు. గురువారం మండలంలోని అలిరాజేపేట గ్రామంలో రైతులకు మొక్కజొన్న పంటలు, రబీ పంటలపై శిక్షణ సదస్సు నిర్వహించారు. అలాగే పంటను పరిశీలించి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు వ్యవసాయ పద్ధతులపై పూర్తి అవగాహన కల్పించడానికే శిక్షణ సదస్సులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొక్కజొన్న పంటల్లో కత్తెర పురుగు నివారణను లింగాకర్షక బుట్టలను వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ వసంత రావు, ఏఈఓ శరణ్య, సర్పంచ్ లక్ష్మీ, ఎంపీటీసీ రమ్య, రైతుబంధు సభ్యులు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ ఇళ్లు కేటాయించాలి



మాట్లాడుతున్న మల్లేశ్

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో డబుల్ బెడ్రూం ఎంపికలో అవకతవకలు జరిగాయని, అనర్హులను తొలగించాకే ఇళ్ల ప్రారంభోత్సవానికి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ రావాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ కోరాడు. పట్టణంలోని అనబేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. మొదటి జాబితాలో లేనివారు, రెండో జాబితాలో అర్హులైపోయి, మూడో జాబితా లక్కీ డ్రా బాక్స్‌లో పేర్లు ఎలా వచ్చాయని ప్రశ్నించాడు. రీ సర్వే చేయకుండా అనర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించడానికి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఈ నెల 20న మంత్రి కేటీఆర్‌తో ఇళ్ల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం కట్టించిన ఇళ్లు అర్హులకు కేటాయించాలని లేనిపక్షంలో అర్హుల న్యాయం కోసం కోర్టుకు వెళ్తామని మల్లేశ్ తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కొయ్యడ కొమురయ్య, అయిలేని సంజీవరెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, నాయకులు రాజ్‌కుమార్, మల్లారెడ్డి, కుదరత్ అలీ పాల్గొన్నారు.

‘హామీల అమలులో బీఆర్‌ఎస్ విఫలం’



కొమురవెల్లిలో మాట్లాడుతున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా మండల కాంగ్రెస్ నాయకులు మండలంలోని కిష్టంపేట, లెనిన్‌నగర్, మర్రిముచ్చాల, గౌరాయపల్లి, కొమురవెల్లి, రాంసాగర్, రసులాబాద్, అయినాపూర్, తపాస్‌పల్లి, గురువన్నపేట, పోసాన్‌పల్లి గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గురువయ్యగౌడ్ మాట్లాడుతూ.. మండలంలో ఒక్క నిరుపేదకు కూడా డబుల్ బెడ్రూం ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతీ రైతుకు రెండు లక్షల రుణమాఫీ వెంటనే చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వకుళభరణం నర్సయ్య పంతులు, లింగంపల్లి శ్రీనివాస్, మంచాల చిరంజీవులు, లింగంపల్లి కనుకరాజు, కొయ్యడ శ్రీనివాస్, పోతుగంటి రవి, స్వాములపల్లి రమేశ్, వంగప్రసాద్‌రెడ్డి, ఏర్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, ఎంపీపీ కరుణాకర్

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురి వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఆలయంలో ధ్వజ స్తంభం, విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యాక్రమాల ముగింపు సందర్భంగా గురువారం నిర్వహించిన కల్యాణ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్‌తో కలిసి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని, ప్రస్తుతం రూ.10లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమం చక్రవర్తుల రంగాచార్యులు, వారి కుమారులు రాజగోపాలచార్యులు, శ్రీనివాసచార్యులు, జగన్ నివాసచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించగా సర్పంచ్ సంతోషి కరుణాకర్, గ్రామప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

భూనిర్వాసితులకు న్యాయం చేయకుంటే ఉద్యమిస్తాం

కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత రేణుకాచౌదరి



ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పర్యటిస్తున్న రేణుకాచౌదరి

ములుగు(గజ్వేల్): కొండపోచమ్మ సాగర్ భూ నిర్వాసితులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో న్యాయం చేయకపోతే తాము నిర్వాసితులకు అండగా నిలిచి ఉద్యమించక తప్పదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత రేణుకాచౌదరి హెచ్చరించారు. గురువారం ఆమె కరీంనగర్ వెళ్తూ ములుగు మండలం మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీనీ మండల మాజీ అధ్యక్షుడు తమ్మల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సందర్శించారు. ప్యాకేజీలు అందక, కొరవడిన వసతుల మధ్య ప్రభుత్వం కేటాయించిన రేకుల ఇళ్లలో నివాసముంటున్న నిర్వాసితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రేణుకాచౌదరి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిర్వాసితులకు ప్యాకేజీలను ఇవ్వకుండా, డబుల్ బెడ్రూంలను కేటాయించకుండా వారిపై కఠినంగా వ్యవహరించడం దేనికని ప్రశ్నించారు. పచ్చని పంట పొలాలను ధ్వంసం చేసి, రైతులను ఆగం చేసి ఫామ్‌హౌస్ వాస్తు కోసమే సీఎం ప్రాజెక్టును నిర్మించారని విమర్శించారు. ముందుగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రేణుకాచౌదరికి కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ సభ్యుడు జస్వంత్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు విజయ్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



నంగునూరు: అక్కేనపల్లి మోడల్ స్కూల్‌లో..



మర్కూక్(గజ్వేల్): ఎర్రవల్లి పాఠశాలలో..

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని అక్కేనపల్లి మోడల్ స్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. స్పెషల్ ఆఫీసర్ రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయులు సైదిరెడ్డి, ఆంజనేయులు అధ్యాపక బృందం చక్కగా పాఠాలు బోధించిన విద్యార్థులను అభినందించారు.

మర్కూక్(గజ్వేల్): మండలంలోని ఎర్రవల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 7వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యబోధన నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఈఓ సుధాకర్‌రెడ్డి, తదితరులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ గురువారం దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిలకు ఆలయ ఈఓ సుధాకర్‌రెడ్డి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, మాజీ ధర్మకర్త రాములు ఉన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి



చేర్యాల(సిద్దిపేట): అద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



హుస్నాబాద్: కంటి పరీక్షలకు తరలివచ్చిన ప్రజలు

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు 2వ విడత కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని చుంచనకోట గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఆయన వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

మున్సిపాలిటీలో..

మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, స్థానిక వార్డు కౌన్సిలర్ ఉడుముల ఇన్నమ్మతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ ప్రభాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని మాలపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజనీతిరుపతిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సౌమ్య, సర్పంచ్ బత్తుల మల్లయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బత్తుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

హుస్నాబాద్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 8వ వార్డులో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్ వేణుయాదవ్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

హుస్నాబాద్: మున్సిపల్ నూతన భవన నిర్మాణ పనుల్లోనాణ్యత లోపిస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలో కొనసాగుతున్న భవన నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. నాణ్యమైన ఇసుక, సిమెంట్, కంకర సమపాళ్లలో కలుపకుండా కాంట్రాక్టర్ ఇష్టం ఉన్నట్లు పనులు చేపడుతున్నా అధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. ప్రజల సొమ్ము దుర్వినియోగం కాకుండా అధికారులు ఎప్పటికప్పుడూ పరిశీలించాలని మల్లికార్జున్‌రెడ్డి కోరాడు.

◆ గురు పారాయణంతో సకల శుభాలు

నంగునూరు(సిద్దిపేట): గురు పారాయణం విన్నవారికి సకల శుభాలు కలుగుతాయని దత్తక్షేత్ర వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ కుప్పా శ్రీపాదశర్మ అన్నారు. రాంపూర్‌లోని కల్ప వృక్షాచ్ఛాయా శ్రీపాద శ్రీవల్లభ దత్తక్షేత్రంలో నిర్వహిస్తున్న గురు చరిత్ర సప్తాహం ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీపాదశర్మ మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం క్షేత్రంలో నిర్వహిస్తున్న పారాయణ, ప్రవచణ కార్యక్రమాలు శుక్రవారంతో ముగుస్తాయన్నారు. శనివారం ప్రత్యేక పూజల అనంతరం అవతరణిక, ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా దత్త దీక్ష చేపట్టిన భక్తులు దీక్ష విరమణ చేస్తారన్నారు.

◆ పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కొండపాక(గజ్వేల్): గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది వేతనాలను చెల్లించాలని కోరుతూ గురువారం గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాగుల లక్ష్మణ్ ఆధ్వర్యంలో డీపీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చే అరకొర వేతనాలను సైతం క్రమం తప్పకుండా చెల్లించకపోవడం దారుణమన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలను చెల్లించాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భూపతిరెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మండలం రిమ్మనగూడకు చెందిన శివనగారి విజయ అనారోగ్యం బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొందగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.83,500ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, నాచారం దేవాలయ కమిటీ డైరెక్టర్ భీమప్ప, సోషల్ మీడియా కన్వీనర్ శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.

◆ పేదలకు అండగా ఉంటా..

దుబ్బాక: కష్టాల్లో ఉన్న పేదలకు అండగా ఉండేందుకే ప్రజాహిత ఫౌండేషన్ స్థాపించామని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మామిడి మోహన్‌రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడు మృతి చెందడంతో గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా శేరిపల్లి బందారం గ్రామానికి చెందిన ప్రవీణ్ కుటుంబ సభ్యులను, రాయపోల్ మండల కేంద్రంలో తలారి లక్ష్మయ్య, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుమ్మరి రామస్వామి కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

◆ బాటసారుల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

హుస్నాబాద్: వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి హుస్నాబాద్ నియోజకవర్గంలోని 12 కూడళ్లలో చల్లని మినరల్ వాటర్‌తో జీఎస్‌ఆర్ చలివేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు బీజేపీ నాయకుడు, వృక్ష ప్రసాద దాత జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ చలివేంద్రాలను ఈ నెల 10వ తేదీన ప్రారంభించనున్నట్లు తెలిపారు. చలివేంద్రాలు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు తెరిచి ఉంటాయని తెలిపారు. కొన్నిచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయడాన్ని అధికార పార్టీ కార్యకర్తలు అడ్డుకుంటున్నారని, ఓ సర్వీస్ చేయడానికి అనుమతి అక్కర్లేదని అడ్డుకునే వారిని చూస్తే జాలి వేస్తుందన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సురేందర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, కౌన్సిలర్ శ్రీనివాస్ ఉన్నారు.

◆ పేదలకు సేవ చేయడమే లక్ష్యం



చిన్నకోడూరు(సిద్దిపేట): జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు విరివిగా చేపట్టి పేదలకు సేవ చేయడమే కేఆర్‌ఆర్ ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్‌రావు అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని రామునిపట్ల, పెద్దకోడూరు, చిన్నకోడూరు, మేడిపల్లి, మాచాపూర్, సికింద్లాపూర్ గ్రామాల్లో యువతకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు రమేశ్, ధీరుబాయ్, యూసూఫ్, గిరి, కిరణ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, వెంకట్, సంతోష్, నవీన్, రాజు, మహేందర్ పాల్గొన్నారు.

◆ పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని సామాజిక సమరసత వేదిక జిల్లా కన్వీనర్ రమేశ్ అన్నారు. గురువారం దుబ్బాక పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, వేదిక సభ్యులు తదితరులు ఉన్నారు.

◆ సిండికేట్‌తో మున్సిపల్ ఆదాయానికి గండి

హుస్నాబాద్: మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వారసంత బహిరంగ వేలంలో కాంట్రాక్టర్లు సిండికేట్‌గా ఏర్పడి మున్సిపల్ ఆదాయానికి గండికొట్టారని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ఆరోపించాడు. పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో ఉన్న వేలం పాటపై 10శాతం పెంచాల్సి ఉన్నా తూతూమంత్రంగా వేలం పాట పాడి గత కాంట్రాక్టర్లు దక్కించుకున్నారని తెలిపారు. మున్సిపాలిటీకి అధికంగా రూ.5లక్షలు రావాల్సి ఉన్నా ముందుగానే అంగడి కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి వారు నిర్ణయించుకున్న టార్గెట్‌ను పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఈ వేలం ప్రక్రియలో ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు చక్రం తిప్పినట్లు తెలుస్తుందన్నారు. మున్సిపల్ కమిషనర్ విచారణ జరిపి రీ టెండర్ నిర్వహించాలని రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశాడు. సమావేశంలో పార్టీ నాయకులు శంకర్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.